క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఉదయగిరి: గండిపాళెం ఎస్సీ కాలనీకి చెందిన చేవూరి వెంగయ్య కుమారుడు చేవూరి కృష్ణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యఖర్చుల నిమిత్తం జీఎంకే ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. జీఎంకే ట్రస్ట్ ప్రతినిధుల ద్వారా కృష్ణ కుటుంబ సభ్యులకు ఆదివారం నగదు అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

పది పరీక్షలపై అవగాహన సదస్సు నేడు

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏబీసీడబ్ల్యూఓ చల్లా శ్రీదేవి శనివారం తెలిపారు. ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే అవగాహన సదస్సుకు జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. వసతిగృహాల విద్యార్థులను తీసుకురావాలని వార్డెన్లను కోరారు.

ఓటుకు ఆధార్ అనుసంధానం

అనుమసముద్రంపేట: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. శనివారం వారు ఏఎస్‌పేటలో ఇంటింటికి వెళ్లి ఓటుకు ఆధార్, ఫోన్ నంబర్ అనుసంధానం చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, సుశీల, సావిత్రి, షాకీరా పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన



అల్లూరు: హౌసింగ్ డే సందర్భంగా బట్రకాగొళ్లులో గృహ నిర్మాణాల పురోగతిని ఎంపీడీఓ శ్రీదేవి శనివారం పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉగాది నాడు లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించేందుకు నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట హౌసింగ్ ఏఈ జమీల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ ఉన్నారు.

మైనింగ్‌కు అనుమతివ్వొద్దు



వింజమూరు: చాకలికొండ సమీపంలోని కొండ ప్రాంతంలోని సర్వేనంబర్ 482లోని 15.25 ఎకరాల భూమిలో మైనింగ్‌కు ఏ వన్ మినరల్ సంస్థ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. ఇందుకు సంబంధించి చాకలికొండ పంచాయతీ పరిధిలోని బత్తినవారిపల్లిలో శనివారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండానే ప్రజాభిప్రాయసేకరణ చేపట్టడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్‌తో పర్యావరణం దెబ్బతినే ప్రమాదం ఉన్నందున తమ గ్రామంలో మైనింగ్‌కు అనుమతులు ఇవ్వొద్దని కోరారు.

మామిడికి తెగుళ్ల బెడద

- ఉద్ధృతంగా తామర, తేనెమంచు పురుగు
- దిగుబడులపై ప్రభావం
- ఆందోళనలో మామిడి రైతులు

కావలి/బిట్రగుంట: వాతావరణంలోని మార్పుల కారణంగా మామిడి తోటలను తెగుళ్లు ఆశిస్తున్నాయి. చలి, మంచు తీవ్రత తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం..అదే సమయంలో మామిడితోటలు లేతపూత దశలో ఉండడంతో తామర, తేనెమంచు పురుగు వేగంగా వ్యాపిస్తోంది. కావలి డివిజన్ పరిధిలోని కావలి, అల్లూరు, బోగోలు, దగదర్తి, తదితర మండలాల్లో సుమారు 4,300 ఎకరాలకుపైగా మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం 70 శాతం తోటలు పూతదశలో ఉన్నాయి. పదిరోజుల నుంచి వాతావరణంలో అనూహ్యంగా మంచు, చలి తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం తెగుళ్ల వ్యాప్తికి అనుకూలంగా మారింది. ప్రధానంగా తామర, తేనెమంచు, గొంగలి పురుగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో పూత పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరుగుతున్న పెట్టుబడులు

మామిడి తోటలు పూతదశలో ఉన్న సమయంలో తెగుళ్ల తాకిడి పెరగడంతో నివారణకు పురుగు మందుల వినియోగంతో పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. తేనెమంచు పురుగుల కారణంగా మసిమంగు తెగులు కూడా వేగంగా వ్యాపిస్తుండడంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో పాటు కాయనాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. మందులు వినియోగించినా తెగుళ్ల తాకిడి తగ్గకపోవడంతో మళ్లీ మళ్లీ కొట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో పెట్టుబడులు పెరుగుతున్నాయని, దిగుబడులు ఆశాజనకంగా లేకపోతే ఈదఫా నష్టాలు తప్పవని చెబుతున్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈదఫా తెగుళ్ల తాకిడి విపరీతంగా పెరగడంతో పూత కూడా ఆశించినంతగా రావడం లేదని వాపోతున్నారు.



విరబూసిన మామిడి పూత(ఇన్‌సెట్లో) తామర పురుగు ఆశించిన పూత

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

మామిడిలో వేగంగా వ్యాపిస్తున్న తామర, తేనెమంచు పురుగు, మసిమంగు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు కీలకమని కావలి ఉద్యాన శాఖ అధికారిణి సుధామయి తెలిపారు. తోటల్లో ఎండు పుల్లలు తొలగించి చెట్ల పాదులతో పాటు తోటచుట్టూ ఉన్న కలుపు మొక్కలను నివారించాలని సూచించారు. తామరపురుగు నివారణకు స్పైనోసాడ్ లేదా థయోమిథాక్సమ్ మందులను 3 మి.లీ. లేదా డైమిథోయేట్ మందు 2 మి.లీను వేపనూనె 3 మి.లీ.లో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గొంగలిపురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 4 మి.లీ. లేదా స్పైనోసాడ్ 35 మి.లీ.ను వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తేనెమంచు పురుగు నివారణకు విప్రోపాజిన్ 2 మి.లీ. లేదా ల్యామ్డా సైహాలోత్రిన్ 0.75 మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ (పచ్చి పూత దశలో) 0.3 మి.లీను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.పండుఈగ సమస్య నివారణకు ఎకరాకు ఒక మెర్క్యురీలైట్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మామిడి తోటల్లో సస్యరక్షణకు సంబంధించిన సమాచారానికి రైతులు కావలిలోని రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



కొండాపురం: మాట్లాడుతున్న ఎంపీపీ అనూరాధ



ఉదయగిరి: మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజ

ఉదయగిరి: మండలంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ మూలె పద్మజ అధికారులకు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందస్తుగా అధికారులు గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. వేసవిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి తీర్మానాలు చేయడం లేదన్నారు. అనంతరం శాఖల వారీగా పురోగతిపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, మండలాధికారులు పాల్గొన్నారు.

కొండాపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఎన్నికలకోడ్‌తో మండలాభివృద్ధిపై చర్చించకుండా నామమాత్రంగా సమావేశాన్ని నిర్వహించి వాయిదా వేశారు. మూడు నెలలు పూర్తికావస్తున్న క్రమంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ ఎం బ్రహ్మయ్య తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కావలి రూరల్: పట్టణంలోని కచ్చేరిమిట్టలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను మార్చి 2 నుంచి 11వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 2న అఖండ దీపారాధన, రక్షాబంధనంతో ప్రారంభమై 11న పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నవరం వెంకట సత్యనారాయణ, తిరువీధి వీరబ్రహ్మయ్య, నరహరి హరిబాబు, తిరువీధి ప్రసాద్, పీఎల్ కాంతారావు, మారుతీరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

లారీ బోల్తా

సంగం: ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన గాంధీజనసంఘం వద్ద శనివారం చోటు చేసుకుంది. ఆత్మకూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను తప్పించబోయి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

గ్రిగ్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థుల సత్తా

అనుమసముద్రంపేట: ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీల్లో ఏఎస్‌పేట కేజీబీవీ విద్యార్థులు సత్తాచాటారు. సంగం మండలం కొరిమెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన గ్రిగ్ పోటీల్లో జూనియర్ బాలికల విభాగంలో సీహెచ్ శైలజ 100, 200 మీటర్ల పరుగులో విజేతగా, లాంగ్‌జంప్‌లో ద్వితీయస్థానంలో నిలిచింది. ఏ మధుప్రియ హైజంప్‌లో ద్వితీయస్థానంలో నిలిచింది. సీనియర్ బాలికల విభాగంలో బీ హర్షిణి 200 మీటర్ల పరుగులో విజేతగా నిలిచింది. జావలెన్ త్రో, 400 మీటర్ల రిలే పరుగు, తదితర పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణించిన విద్యార్థులను ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ లక్ష్మి

ప్రణాళికాబద్ధంగా చదవాలి

ఆత్మకూరు: పదోతరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతిగృహాలను శనివారం ఆయన సందర్శించారు. వసతిగృహాల్లో కల్పిస్తున్న వసతులు, భోజనాల నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు సంక్షేమ వసతి గృహాలకు వెచ్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చేలా విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వసతిగృహాల సిబ్బంది ఉన్నారు.



వసతిగృహ విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి రాజేష్

ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



ఆత్మకూరు: క్షణికావేశంలో నేరాలు చేసి జైలుకు వచ్చిన వారు సత్ప్రవర్తనతో నడుచుకోవడం ద్వారా శిక్షను తగ్గించుకోవచ్చని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ అన్నారు. పట్టణంలోని సబ్‌జైలును శనివారం ఆయన సందర్శించారు. జైల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ఖైదీలను ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యతను రుచి చూశారు. జడ్జి వెంట జైలు సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆశీర్వదించండి

కొండాపురం : త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని ఆదిమూర్తిపురంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మంచి సంబంధాలు కలిగిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. అనంతరం కాశీమల్లికార్జున స్వామి సమేత విశాలక్ష్మి ఆలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు మెట్టుకూరి భాస్కర్‌రెడ్డి, కే కృష్ణారెడ్డి, పాండురంగారెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, స్థానికులు మాల్యాద్రి, శంకర్, తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు

ప్రభుత్వ యాప్‌లపై అవగాహన

అత్మకూరురూరల్: ప్రభుత్వ యాప్‌లపై సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ షేక్ నజీర్‌బాషా, ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎస్‌ఎంలు, మహిళా పోలీసులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా శాఖకు సంబంధించిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల డేటాను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్‌లలో నమోదు చేయాలని సూచించారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే హెచ్‌ఎంల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణం పరిష్కరించాలని కోరారు. వైకేపీ ఏపీఎం వెంకాయమ్మ యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఎంఈఓ షేక్ నజీర్‌బాషా

'మా కుటుంబాన్ని ఆదుకోండి'

కావలి : తమ కుటుంబాన్ని ఆదుకోవాలని రైలు క్రింద పడి ఆత్మహత్య చేసుకున్న ఇంజినీరింగ్ విద్యార్థి ప్రదీప్ తల్లిదండ్రులు లక్ష్మీకుమారి, పెంచలయ్య విజ్ఞప్తి చేశారు. కావలిలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఏ ఆస్తులు లేని తాము కుమారుడ్ని చదివించుకుని స్థిరపడాలని ఎన్నో ఆశలు పెట్టుకున్నామన్నారు. బిడ్డను కోల్పోయిన తమకు ఇక ఏ దిక్కూ లేదని, తమను ఆదుకోవాలని కోరారు.

ఓటర్ల జాబితాలు సిద్ధం

అత్మకూరురూరల్: చెర్లోయడవల్లి సర్పంచ్, మహిమలూరు ఏడో వార్డు సభ్యుడి స్థానాలకు త్వరలో జరుగనున్న ఉపఎన్నికలకు సంబంధించి మండల పరిషత్ అధికారులు శనివారం ఓటర్ల జాబితాలను సిద్ధం చేశారు. ఈఓపీఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి పల్లవోలు భాస్కర్, సాంకేతిక సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



వింజమూరు: మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లను కావలి ఆర్డీఓ శీనానాయక్ శనివారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల్లో విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు, సర్వేయర్ ఖాదర్‌హుస్సేన్, ఆర్ఐ షేక్ సిరాజ్, హెచ్‌ఎం మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



సంగం: ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీల్లో కొరిమెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం అభినందనీయమని ఎంఈఓ జానకీరాం అన్నారు. శనివారం కొరిమెర్ల ఉన్నత పాఠశాలలో క్రీడాకారులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

విదేశీ యాత్రికుడి సందడి

సోమశిల: ఫిన్‌లాండ్ దేశానికి చెందిన ఆసోసియో సైకిల్ యాత్ర చేస్తూ అనంతసాగరానికి శనివారం రాత్రి చేరుకున్నాడు. తాను భారతదేశం మొత్తం సైకిల్‌పై చుట్టిరావాలనే ఆకాంక్షతో యాత్రను ప్రారంభించి, ఇప్పటి వరకు 2500 కిలోమీటర్లు ప్రయాణం సాగించినట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం నిర్వహణకు సంబంధించి నిర్వాహకుడు, ముగ్గురు సహాయకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల మధ్యాహ్న భోజనం అమలు కమిటీ చైర్మన్, తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి, కన్వీనర్ ఎంఈఓ మస్తాన్‌వలి, సభ్యులు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ శనివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలిగిన అర్హులైన వారు ఈ నెల 27వ తేదీలోగా ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



సోమశిల: పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కావలి డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతసాగరంలోని టీజీఎస్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. తొలుత మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట బోగోలు ఎంఈఓ జయంత్ బాబు, హెచ్‌ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సచివాలయంలో తనిఖీలు



ఆత్మకూరురూరల్: మండలంలోని చెర్లోయడవల్లి సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి జయచంద్ర, వీఏఏ శ్రీహర్ష, ఏఎస్‌ఎం షంషాద్ పాల్గొన్నారు.

కేజీబీవీకి వాటర్ కూలర్ వితరణ



మర్రిపాడు: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయానికి యువర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వాటర్‌కూలర్‌ను శనివారం బహూకరించారు. ట్రస్టు చైర్మన్ గువ్వల మౌనిక, కోఆర్డినేటర్ మల్లేశ్వరి, సభ్యులు గువ్వల సాగర్ మాట్లాడుతూ విద్యార్థినులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించేందుకు వాటర్ కూలర్‌ను బహూకరించినట్లు తెలిపారు. ప్రిన్సిపల్ లక్ష్మీదేవి మాట్లాడుతూ యువర్స్ ట్రస్టు సభ్యులను అభినందించారు.